క్లుప్తంగా

పొగాకు అత్యధిక ధర రూ.202

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ. 202 నమోదవటంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కె. ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు వేలానికి 904 బేళ్లను వేలాని తీసుకురాగా వాటిలో 864 కొనుగోలు జరిగాయి, 40 పొగాకు బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 202 కాగా, కనిష్ట ధర రూ. 160 పలకగా, సరాసరి రూ. 199.44 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 27 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు


పూజలు చేస్తున్న అర్చకులు


గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో నూతన ఆలయం

పామూరు: మండలంలోని చిలంకూరులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామ ఆలయంలో సీతా రామ, లక్ష్మణ, హనుమంత, నాభిశిల విగ్రహ ప్రతిష్ట శనివారం రుత్వికుల వేదమంత్రాల నడుమ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అర్చకులు విశపుకుమార స్వామి ఆధ్వర్యంలో గణపతిపూజ, గోపూజ, పుణ్యాహవాచనం, నాంది, ఆచార్యాది రుత్విగరణం, మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, సుందరకాండ పారాయణం, లలితాసహస్తనామం, అంకురారోపణం, అగ్ని ప్రతిష్టా, గణపతిహోమం నిర్వహించారు. 5 రోజులపాటు జరగనున్న మహోత్సవాల్లో 31వ తేదీ ప్రతిష్ట చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నూతన ఆలయాన్ని ప్రత్యేక పూలతో సుందరంగా తీర్చదిద్దారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్న


జాళ్లపాలెంలో మాట్లాడుతున్న వరికూటి


పైడిపాడులో వరికూటికి భారీ ర్యాలీతో స్వాగతం పలికిన ప్రజలు

జాళ్లపాలెం(కొండపి): రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల పక్షం నిలిచి పేదల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అలుపెరగని కృషి చేస్తున్నారని కొండపి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. పెదకండ్లగుంట పంచాయతీ జాళ్లపాలెంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. కొండపి నుంచి జాళ్లపాలెం వరకు నిర్మించిన 12కిలో మీటర్ల తారురోడ్డుతో పాటు జాళ్లపాలెంలో నిర్మించిన సిమెంటురోడ్డులను ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి అరుణకుమారి, సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణ, వైస్ సర్పంచ్ బండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జరుగుమల్లి (సింగరాయకొండ): పైడిపాడులో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వరికూటి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి అందజేయాలన్నారు. ఒకటిన్నర సెంట్ల స్థలం శవాన్ని పూడ్చడానికి సరిపోతుందని చంద్రబాబు వ్యాఖ్యానించడాన్ని ఖండించారు. ఎంపీడీఓ పి. రామకృష్ణ, సర్పంచ్ నాగినేని భాస్కర్ చౌదరి, రెడ్డిపాలెం సర్పంచ్ సోము సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ రామచంద్రరావు, నల్లూరి సురేంద్ర, మూలే శ్రీనివాసరెడ్డి, బత్తిన ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ పల్లాల శివకోటిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు


పైడిపాడులో వలంటీర్లను సత్కరిస్తున్న వరికూటి

జరుగుమల్లి (సింగరాయకొండ): వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేస్తూ పథకాలు అందేలా కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. పైడిపాడు పంచాయతీ కార్యాలయంలో శనివారం పైడిపాడు, చతుకుపాడు, చిర్రికూరపాడు, కామేపల్లి, నర్సింగోలు, పచ్చవ, వర్థినేనివారిపాలెం గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మాట్లాడారు. చంద్రబాబు.. వలంటీర్ వ్యవస్థ రద్దు చేస్తానని ప్రచారం చేస్తున్నాడని విమర్శించారు. 5 గురికి సేవారత్న, 87 మందికి సేవామిత్ర పతకాలు అందజేసి సత్కరించారు. ఎంపీడీఓ పి. రామకృష్ణ, మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, సర్పంచులు పాల్గొన్నారు.

18 పొగాకు అక్రమ బేళ్లు స్వాధీనం


టంగుటూరులో వేలం కేంద్రంలో అక్రమ పొగాకు బేళ్లు, వాహనంతో అధికారులు

టంగుటూరు: అక్రమంగా తరలిస్తున్న పొగాకు బేళ్లను శుక్రవారం అర్ధరాత్రి పొగాకు బోర్డు విజిలెన్సు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సింగరాయకొండ వద్ద 18 మేలిమి రకం పొగాకు బేళ్లను కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తుండగా అధికారులు గౌతమ్, నవీన్, నాయక్, సాయి ప్రశాంత్ సింగరాయకొండ వద్ద అడ్డగించి బేళ్లను వాహనంతో సహా టంగుటూరు వేలం కేంద్రం అధికారికి స్వాధీనం చేశారు. 18 మేలిమి రకం పొగాకు బేళ్లు సుమారు 2400 కేజీలుంటాయి, వాటి విలువ ప్రస్తుతం మార్కెట్లో రూ. 4.5 లక్షల వరకు ఉంటుందన్నారు. అక్రమంగా పొగాకు బేళ్లను విక్రయించినా, కొనుగోలు చేసినా భారీగా జరిమానా విధించటంతో పాటు లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. అక్రమ కొనుగోళ్ల గురించి సమాచారం తెలిపిన వారికి పారితోషికం ఇస్తామని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

సామాజిక బహిష్కరణపై విచారణ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీ దేవలంపల్లెపాలెంలో శనివారం గ్రామానికి చెందిన కన్నా నాగరాజు కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేయటంపై జేసీ కె. శ్రీనివాసులు ఆధ్వర్యంలో బహిరంగ విచారణ నిర్వహించారు. శింగోతు శ్రీను మరో ఏడుగురు తనను గ్రామ బహిష్కరణ చేయడంపై న్యాయం చేయాలని కోరుతూ కర్నూలులోని మానవ హక్కుల కమిషన్‌ను కన్నా నాగరాజు ఆశ్రయించారు. దీంతో కమిషన్ ఆదేశాలపై అధికారుల బృందం గ్రామంలో విచారణ నిర్వహించగా గ్రామస్తులు ఇకపై గ్రామంలో అటువంటి ఇబ్బందులు జరగకుండా చూస్తామని అంతా కలిసి ఉంటామని అధికారులకు హామీ ఇచ్చారు. ఫిర్యాదుదారుడు కన్నా నాగరాజు పాల్గొనకపోవటంతో ఇంకోరోజు విచారణ జరపనున్నట్లు అధికారులు తెలిపారు. అడిషనల్ ఎస్పీ కె. నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, ఒంగోలు ఆర్‌డీఓ కె. విశ్వేశ్వరరావు, తహసీల్దార్ సి.హెచ్ ఉష, ఎస్సై మహమ్మద్ ఫిరోజ్‌ఫాతిమా, డీటీ తన్నీరు వెంకటేశ్వరరావు, ఏఎస్ఓ సుబ్రమణ్యం, ఆర్ఐ తన్నీరు తిరుమలరావు, సర్పంచ్ పాకనాటి అనసూర్యమ్మ, పంచాయతీ కార్యదర్శి షేక్ సైదులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 11వ వార్డు దేవాంగ నగర్‌లో శనివారం మున్సిపల్ చైర్మన్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మున్సిపల్, సచివాలయ సిబ్బంది పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే శాఖపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వార్డుల్లోని ప్రధాన వీధుల్లో ఇబ్బందికరంగా ఉన్న చిల్ల చెట్ల తొలగింపుకు ఆదేశాలిచ్చారు. తక్షణ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. దశల వారీగా వార్డులోని అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీ కాశీరాజు, ఎమ్యునిటీ సెక్రటరీ షంషీర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి వార్షిక వేడుకలు


ఆలయంలో పూజలు చేస్తున్న వైస్ ఎంపీపీ ప్రభంజన వెంకటరెడ్డి దంపతులు

సీఎస్‌పురం(పీసీపల్లి): మండలంలోని అయ్యలూరివారిపల్లిలో గ్రామ దేవత పోలేరమ్మతల్లి వార్షిక వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. వేడుకలను పురస్కరించుకుని రెండవ రోజైన శనివారం అమ్మవారికి 101 కలశాలతో అభిషేకం చేశారు. అనంతరం చండీహోమం పూజలు చేశారు. వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన, వెంకటరెడ్డి దంపతులు, సర్పంచ్ ముత్యాల భారతీ, నారాయణరెడ్డి దంపతులు, మాజీ జెడ్పీటీసీ ముత్యాల లక్ష్మీదేవి, సుబ్బారెడ్డి దంపతులు వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన, వెంకటరెడ్డి, పాలుగుళ్ల జయమ్మ, వెంకటరెడ్డి దంపతుల సహకారంతో రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాలుగుళ్ల రాజ్యలక్ష్మి, నారాయణరెడ్డి దంపతుల సహకారంతో మధ్యాహ్నం, పాలుగుళ్ల లక్ష్మీదేవి, రాజేంద్రరెడ్డి దంపతుల సహకారంతో రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం


మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

కొండపి: రైతులు చుక్కల భూముల సమస్యతో ఎన్నో ఏళ్లుగా పలు ఇబ్బందులు పడటాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించటంతో రైతులకు మేలు జరిగిందని తహసీల్దార్ పి. సింగారావు తెలిపారు. స్థానిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో శనివారం ఎంపీపీ కొండసింగు స్వప్నకుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. 4,123 మంది రైతులకు సబంధించి 5146 ఎకరాలకు పైగా చుక్కల భూములను ప్రభుత్వం నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి అరుణకుమారి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా పాలన చేస్తోందన్నారు. వైఎస్ ఎంపీపీ వేముల వెంకటప్రసాద్ మాట్లాడుతూ అనకర్లపూడిలో రైతులకు పంట నష్ట పరిహారం రాలేదన్నారు. ఎంపీడీఓ బ్రహ్మయ్య, ఎంపీపీ కె. స్వప్నకుమారి పాల్గొన్నారు.

పర్యావరణహిత జీవనశైలి అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి

వెలిగండ్ల: ప్రజలు పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవాలని జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ టి. సుకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పర్యావరణహిత జీవనశైలి అనే అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన భాధ్యత అందరిపై ఉందన్నారు. రోజువారి జీవనంలో మనం చేసే చిన్న చిన్న మార్పులు పర్యావరణానికి ఉపయోగపడతాయన్నారు. శక్తి వనరులను, నీటిని పొదుపుగా వాడాలన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించాలని సూచించారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ పీవీ సాయికుమార్, బీట్ ఆఫీసర్ నవీన్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చిలకల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వై నాగూర్‌యాదవ్ పాల్గొన్నారు.

30 నుంచి వరాహ లక్ష్మీనరశింహస్వామి బ్రహ్మోత్సవాలు

సింగరాయకొండ: పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరశింహస్వామి దేవస్థానంలో ఈనెల 30వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పీ కృష్ణవేణి అన్నారు. పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరశింహస్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈవో పీ కృష్ణవేణి మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ రాత్రి 8 గంటలకు అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం కాగా 31 వ తేదీ చంద్రప్రభ వాహనం, జూన్ 1న గురువారం ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం హంసవాహనం, 2వ తేదీ శేషవాహనం, 3న హనుమంతసేవ, 4న ఉదయం మోహిని ఉత్సవం, రాత్రికి గరుడ సేవ, 5వ తేదీ రాత్రి వసంతోత్సవం, గజోత్సవం, 6వ తేదీ ఉదయం కళ్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం, 7వ తేదీ రాత్రి అశ్వవాహనం, 8వ తేదీ ఉదయం లక్ష్మీసంవాద ఉత్సవం, చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణ-పూర్ణాహుతి, 9వ తేదీ రాత్రి పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. ఉత్సవాల సందర్భంగా పాటకచ్చేరి, భరతనాట్యం, కూచిపూడి, రామాంజనేయ యుద్ధం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, రాష్ట్ర స్థాయి బండలాగుడు, రాదాడి పోటీలు నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించి కరపత్రిక పంచిపెట్టారు. ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు, బోర్డు సభ్యులు రాజు కోటేశ్వరమ్మ వెంకటేశ్వరరెడ్డి, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, గోకరాజు పాపయ్య, మట్టా సుబ్బారావు, ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శేష లక్ష్మీనరశింహాచార్యులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉంటే పని

జరుగుమల్లి (సింగరాయకొండ): జాబ్‌కార్డుదారులందరికీ కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని కల్పిస్తామని ఎంపీడీఓ పి. రామకృష్ణ అన్నారు. జరుగుమల్లి మండలం చతుకుపాడులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం పరిశీలించారు.
హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలం పైడిపాడు పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెం, అక్కచెరువుపాలెం గ్రామ సచివాలయ పరిధిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.


ఈదురుగాలులతో వర్షం

కనిగిరి రూరల్: కనిగిరిలో శనివారం సాయంత్రం ఈదురుగాలుతో వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడ్డాయి. దీంతో పట్టణంలోని అనేక వార్డుల్లో విద్యుత్ సరఫరా నిలిచి అంధకారం నెలకొంది. కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల రేకుల ఇళ్ల పైకప్పులు ఎగిరాయి. ఫ్లెక్సీ కటౌట్‌లు నెలకొరిగాయి. పట్టణంలో మాజీ సర్పంచ్ వీవీఆర్ మనోహర్ ఇంటి వద్ద మలుపులో కరెంట్ స్తంభం ఒరిగి కిందపడింది. అదృష్టవశాత్తు ఎవరికి ప్రమాదం సంభవించలేదు. అలాగే వర్షం నీటి ధాటికి శివారు ప్రాంతాల్లోని మట్టి రోడ్లు చిత్తడిమయంగా మారాయి.

డీఎస్పీని సన్మానించిన జెడ్పీటీసీ

కనిగిరి రూరల్: కనిగిరి డీఎస్పీ రత్నాకర రామరాజును జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కస్తూరిరెడ్డి డీఎస్పీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి రఘురామిరెడ్డి తదితరులున్నారు.

బాల్య వివాహాలు అడ్డుకోండి


మాట్లాడుతున్న సీడీపీఓ మల్లీశ్వరి

సింగరాయకొండ: బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టంగుటూరు సీడీపీఓ మల్లీశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని షాదిఖానాలో శనివారం బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు షేక్ రిజ్వానా, నాగలక్ష్మి, భారతి, న్యాయసేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

మర్రిపూడి: పశుబీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శ్రావణి శనివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు 20 శాతం, ఏపీఎల్ లబ్ధి దారులకు 50 శాతం ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.